సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా..!

- అంగన్‌వాడీల్లో పోషణ పక్వాడ
- ఈనెల 22 వరకు పక్షోత్సవాలు
- అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

ఇచ్ఛాపురం రూరల్:

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా ఆరోగ్యాంధ్ర సాధించాలనే లక్ష్యంతో ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషకాహార పక్షోత్సవాలు చేపడుతున్నారు. గర్భిణుల బరువు పరిశీలించడం, అవసరమైన వైద్య పరీక్షలు చేయడం, పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల పర్యవేక్షణ, ఎదుగుదల లోపం ఉన్నవారికి పౌష్టికాహారం మందులు అందించి సాధారణ స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మహిళా, శిశు సంక్షేమాధికారులు చెబుతున్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి, ముఖ్యంగా జీవితంలో మొదటి 1000 రోజులపై దృష్టి పెట్టేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.


మండపల్లిలో పోషణ పక్వాడ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో...					
ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0–3 ఏళ్ల చిన్నారులు	3–6 ఏళ్ల చిన్నారులు
ఇచ్ఛాపురం రూరల్, ఇచ్ఛాపురం అర్బన్	260	778	973	4,846	3,841
సోంపేట	227	556	934	3,085	2,673

లబ్ధిదారుల గృహ సందర్శన


చిన్నారులు, తల్లుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న సూపర్‌వైజర్ నీలవేణి

అంగన్‌వాడీ లబ్ధిదారుల గృహాలను అంగన్‌వాడీ టీచర్లతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు సందర్శిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కౌమార బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి అదనపు పోషకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు చేపడుతున్నారు.

చేపడుతున్న కార్యక్రమాలు

- గర్భిణుల పర్యవేక్షణ, రెండు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ.
- తల్లిపాలు అందించడం, అనుబంధ పోషకాహార పద్ధతులపై గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత కౌన్సిలింగ్.
- మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన.
- శిశువుల్లో ఇన్ఫెక్షన్లను నివారించడానికి చేతులు కడుక్కోవడం, పరిశుభ్రతపై అవగాహన.
- చిరుధాన్యాలతో సహా స్థానిక ఆహార పదార్థాలతో పరిపూర్ణమైన ఆహార వంటకాలపై అవగాహన.
- గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు, సంరక్షకులతో గ్రూప్ కార్యక్రమాలు.
- లబ్ధిదారుల మాడ్యూల్‌ద్వారా తల్లులకు వారి స్వీయ ఆరోగ్య స్థితి తెలుసుకోవడం, పిల్లల పెరుగుదల పురోగతి పర్యవేక్షణపై అవగాహన కల్పించడం.
- ఇంట్లో పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాల వంటల ప్రదర్శనలు, స్థానికంగా చవకగా లభించే ఆహార పదార్థాలను ప్రోత్సాహించడం.
- ఊబకాయంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆరోగ్యకరమైన ఆహార ప్రతిజ్ఞ.
- బాలికల కోసం ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సాహించడంపై పోస్టర్, నినాదాల పోటీలు.


చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

పోషకాహారంపై అవగాహన



చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపం లేకుండా పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు రోజువారీ చేపట్టడం జరుగుతోంది. దీనిలో భాగంగా జీవితంలో కీలకమైన మొదటి 1000 రోజులపై దృష్టి పెట్టేందుకు ఈనెల 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
– పురాణం నాగరాణి, సీడీపీవో, ఇచ్ఛాపురం ప్రాజెక్ట్

వినూత్న కార్యక్రమాలు



అధికారుల ఆదేశాలు మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడలో భాగంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాం. చిన్నారులు, వారి తలిదండ్రులను ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం జరుగుతోంది. వైద్య సిబ్బందితో గర్భిణులకు పరీక్షలు, పోషకార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన పోషకారం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.
– బత్రి నరసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, భవానీపురం, ఇచ్ఛాపురం మండలం

రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలోని రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నదులను అనుసంధానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. వంశధార – బాహుదా నదులను అనుసంధానించడం వలన ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది జీడి, మామిడి, పనస పంటలు పూర్తిగా నాశనమయ్యాయని, అందువలన ఉద్యాన రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని విన్నవించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ప్రకాశరావు పట్నాయక్, ఎస్.ప్రేమ్‌కుమార్, బి.జగన్, సల్లా దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా ఈశ్వరరావు

కాశీబుగ్గ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం పలాస నియోజకవర్గ అధ్యక్షుడిగా ఐతి ఈశ్వరరావును ఎంపిక చేశారు. విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాగా వెంగలరావు ఉత్వర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సోంపేట: మండలంలోని కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొర్లాం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఉద్దానం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బారువ, గొల్లగండి, సీహెచ్ గొల్లగండి, బారువ కొత్తూరు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రవివర్మ

కవిటి: విద్యార్థులు మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వి.రవివర్మ సూచించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. రోజులో అధిక భాగం సెల్ ఫోన్ వినియోగం వలన విద్యార్థుల్లో సృజనాత్మకత తగ్గుతోందన్నారు. చిన్న చిన్న తప్పులతో జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎర్రన్నాయుడి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో బస్టాండ్ కూడలిలోని మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతూ ఎర్రన్నాయుడి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రమేష్ పట్నాయక్, లిమ్మాయి, లక్ష్మణ్, మంగళసత్తు, గంగాధర్ రథో తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి అభినందనలు


పూర్వ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

సోంపేట: పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థలకు చెందిన పూర్వ విద్యార్థి అల్లు సాత్విక్ యూనియన్ బ్యాంక్ పీవోగా ఎంపికయ్యారు. దీంతో కళాశాల అధ్యాపక సిబ్బంది గురువారం కళాశాల ఆవరణలో ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఎన్ని దేవరాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం


నేత్రవైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలోని సత్యసాయి మందిరంలో ఉచిత నేత్రవైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 104 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 60 మందిని కంటి శుక్లాల ఆపరేషన్‌కు రిఫర్ చేసి విశాఖపట్నం తరలించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు, కో–ఆర్డినేటర్ బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి నమూనాలే కీలకం

సోంపేట: భూమి ఆరోగ్యానికి, పంట దిగుబడులకు మట్టి నమూనాలు కీలకమని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. మండలంలోని నూకలూరు గ్రామంలో మట్టి నమూనాలు తీసే విధానంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి నమూనాల ఉపయోగాలను రైతులకు వివరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం పుష్పగిరిపై ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పంచామృతాలతో సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్థానిక శ్రీవేంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వాసుదేవ సిద్ధాంతి, సాయిబాబా మందిరం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పలాస: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. కాశీబుగ్గలోని అక్షర కళాశాలలో సీఐటీయూ పలాస మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మిక సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కనీస హక్కులను కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల నెత్తిన భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనాలు పెంచాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి కనీస భద్రతా చట్టాలు, 8 గంటల పనిదినాలను అమలు చేయాలని కోరారు. మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎం.లావణ్య, బి.నిర్మల, పి.భూదేవి, అంబటి ఆనందరావు, పి.పద్మావతి, భవానీ, ఎస్.నిర్మల, మనమ్మ, పుణ్యావతి, బి.స్వాతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గణపతి

కన్వీనర్‌గా లావణ్య

అనంతరం మండల కన్వీయింగ్ బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిలో సీఐటీయూ పలాస మండల కమిటీ కన్వీనర్‌గా లావణ్య, కమిటీ సభ్యులుగా ఎ.ఆనందరావు, బి.శశిరేఖ, ఐ.యజ్ఞ, బి.నిర్మల, ఎస్.లలిత, బి.తిరుపతి, కె.వెంకటి, టి.సింహాద్రి, బి.స్వాతి తదితరులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

వజ్రపుకొత్తూరు: రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండల కేంద్రంలో డీఆర్‌డీఏ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో సమీకృత ఉద్యానవన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన సౌజన్యంతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేకరణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని కోరారు. పథకాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వెలుగు ఏసీ చింతాడ రామ్మోహనరావు, ఎంపీడీవో ఎస్.రమేష్ నాయుడు, డీటీ మురళీకృష్ణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.


రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వైదేహిమాత సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తులసిగాం గ్రామ దేవత వైదేహీ కొత్తమ్మతల్లిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు ఎంపీపీ బోర పుష్ప, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్‌లు ఇసురు తులసీరాం, దుక్క ధనలక్ష్మి, నీలాపు సారధిరెడ్డి, ఇసురు యాధవరెడ్డి, పిట్ట బాలయ్య, బుడ్డ రుషి, సాడి గురుమూర్తి, ఎంపీటీసీ నీలాపు జగదీష్, ఇసురు పరుశురామ్, ఉప్పాడ రాజారెడ్డి, పిట్ట విశ్వనాథం, కీలు ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.


వైదేహీమాత పూజలో పాల్గొన్న పిరియా విజయ

విద్యతోనే ఉత్తమ జీవితం

కంచిలి: విద్యతోనే ఉత్తమ జీవితం లభిస్తుందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మఠం సరియాపల్లి గ్రామ ఏపీ మోడల్ స్కూల్‌లో చదివి ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో–1 ఎస్.శివరాంప్రసాద్, సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకోండి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో టీడీపీ నాయకుల ఆక్రమణ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురుషోత్తపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 51లో సుమారు నాలుగు ఎకరాల భూమిని పట్టణ టీడీపీ నాయకులు ఆక్రమించారని తెలియజేశారు. పద్మనాభపురం సర్వే నంబర్ 395/1, 362/2ఏ, 362/7ఏలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఉన్నారని పేర్కొన్నారు. కాశీబుగ్గలో సర్వే నంబర్ 234/1లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన నాయకుడు ఒకరు ఉన్నారని తెలిపారు. అనంతపురం గ్రామ పరిధి సర్వే నంబర్ 253లో ఉన్న సుమారు 40 సెంట్లు శనీశ్వరుడు కొండ భాగాన్ని, కిడ్నీ ఆస్పత్రి దగ్గర సత్యసాయి భవనానికి ఎదురుగా సుమారు 45 సెంట్ల కొండ భాగాన్ని ఒక టీడీపీ నాయకుడు తన బంధువులు పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. పద్మనాభపురం రెవెన్యూ సర్వే నంబర్ 362/5లో సూదికొండ, పద్మనాభపురం సమీప ఏఎంసీ గోడౌన్ వెనుక భాగం నుంచి, పద్మనాభపురం తాళ్ల చెరువుకు వెళ్లే వరద కాలువ సుమారు 2 ఎకరాల 31 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంతమంది టీడీపీ నాయకులు ఆక్రమించి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనందరావు, బమ్మిడి సంతోష్ కుమార్, తూముల శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, దువ్వాడ రవి, కంచరాన భాస్కరరావు, గోండు మోహన్, గుజ్జు జోగారావు, వాయలపల్లి లక్ష్మణ్, బోనెల రవి, నర్తు వెంకటరమణ, నెయ్యల శివ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్యం అక్రమ రవాణా అడ్డుకోవాలి

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి జిల్లాలోకి మద్యం, గంజాయి అక్రమ రవాణా అడ్డుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఇచ్ఛాపురం వచ్చిన ఆయన స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు తగ్గించాలని, మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చూడాలని ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని బెల్లుపడ గ్రామంలో శనివారం నుంచి 5 రోజులపాటు జరగనున్న శ్రీతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం పురస్కరించుకొని ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ ముకుందరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాలకు జాతీయ రహదారి గుండా బెల్లుపడ రోడ్డులోకి ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అటువంటి వాహనాలకు జాతీయ రహదారి గుండా ఏఎస్‌పేట మీదుగా పట్టణంలోని ప్రవేశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో ఎస్.జోరాడు అన్నారు. సోంపేట పరిధిలోని మొగిలి కొత్తూరు, శివాజీ నగర్లలో గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పించాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యావనరుల సిబ్బంది పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణ సామాజిక బాధ్యత

కవిటి: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎంఈవో ధనంజయ మజ్జి, హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ – జీవన విధానంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.రోషిని ప్రథమ స్థానం, కవిటి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని దుద్ది లిఖిత ద్వితీయ స్థానం సాధించారు.

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలురు పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ఎల్వీ ప్రతాప్ తెలిపారు. నీలంపేట జిల్లా పరిషత్ పాఠశాల నుంచి అన్నెపు ఝాన్సీ, కోటబొమ్మాళి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి నందిగాం నవ్య, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ఆర్.రమ్య, ఎంజేపీ బాలుర రెసిడెన్సియల్ స్కూల్ నుంచి బి.భగవాన్‌లు ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.గోవిందరావు, ఉపాధ్యాయుడు పాపారావు, కె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: స్థానిక మండల రిసోర్సు కేంద్రంలో మండల స్థాయిలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. దీనిలో బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సింహాద్రి హాసిని ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కంచిలి: పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈవోలు


కవిటి: విజేతలను ప్రకటిస్తున్న కవిటి ఎంఈవో ధనంజయ మజ్జి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కవిటి: మండలంలోని బొగిడియపుట్టుగలో పంచాయతీ నిధులు సుమారు రూ.3 లక్షలు వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు స్థానిక సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, ఎస్పీ ప్రవీణ్, ఉప సర్పంచ్ బొగిడియా మంగమ్మ, భవానీ, చందు, కృష్ణ, ముకుంద పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ ద్వారం నుంచి పాఠశాల భవనం వరకు రహదారి నిర్మాణానికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ రహదారి నిర్మాణానికి మండల పరిషత్ సాధారణ నిధులు రూ.6 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్, సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


కాశీబుగ్గ: భవనంపై నుంచి బాలుడిని దించుతున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక సిబ్బంది సూచిస్తున్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు గురువారం చేపట్టారు. పెద్ద భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.
– సాక్షి నెట్‌వర్క్


మందసలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం


టెక్కలి రూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


కంచిలి: ప్రదర్శనలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది


ఇచ్ఛాపురం టౌన్: పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

